# ఊరూరా తెలంగాణ తల్లికి క్షీరాభిషేకాలు


తెలంగాణ తల్లి ఆకృతి మార్చి విగ్రహావిష్కరణ చేయడంపై గులాబీ పార్టీ శ్రేణులు భగ్గుమన్నాయి. సచివాలయం ముందు కాంగ్రెస్ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేశారు. మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ చౌరస్తాలో పార్టీ శ్రేణులతో కలిసి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ క్షీరాభిషేకం చేయగా.. మక్తల్, మదనాపురంలో మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. రేవంత్.. ఒంటెద్దు పోకడలు సరికావని వారు హెచ్చరించారు. - నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, డిసెంబర్ 10



అచ్చంపేటటౌన్ : తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ చౌరస్తాలో బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మూసాపేట : గాజులపేట గ్రామంలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



కొత్తకోటలో కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

## 420 హామీలు నెరవేర్చాలి

- అబద్ధాల పునాదులపై ప్రభుత్వం ఏర్పడింది..
- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మదనాపురం, డిసెంబర్ 10 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో 13 హామీలు ఉన్నాయని, ఓవరాల్‌గా ఇచ్చిన 420 హామీలు నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తకోట పట్టణంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ తల్లి వద్దు.. తెలంగాణ తల్లి ముద్దు అంటూ నినాదాలతో ర్యాలీ చేపట్టారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ సుకేశిని విశ్వేశ్వర్ నివాసంలో మీడియాతో మాట్లాడుతూ అబద్ధపు మాటల మీద ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి గుండుసున్నా అన్నారు. ఆరు గ్యారెంటీల్లో ఒక్క ఫ్రీ బస్సు తప్పా అంతా తుస్సే అన్నారు. ఏడాదిలో ఏం సాధించారని విజయోత్సవాలు జరుపుకొంటున్నారో వివరించాలన్నారు. కనీవిని ఎరగని రీతిలో అభివృద్ధి చేశామని, అందుకే సంబురాలంటూ డిప్యూటీ సీఎం భట్టి ప్రగల్భాలు పలుకుతున్నారని, రాష్ట్రంలో ఏ గ్రామానికైనా వెళ్లి ప్రజలను అడిగితే చేసిందేమిటో తెలుస్తుందన్నారు. ఎప్పుడు చూసినా రేవంత్‌రెడ్డి కేసీఆర్ మీద తిట్లు, దేవుడి మీద ఒట్లు, ఇచ్చిన హామీలకు తూట్లు.. ఇవి తప్పా చేసేందేమీ లేదన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం దాదాపు 17, 18 ఏండ్ల కిందట నాటి ఉద్యమకారులు, కళాకారులు, మేధావులను సంప్రదించిన తర్వాతనే రూపుదిద్దుకున్నదని గుర్తు చేశారు. ఇన్నేండ్ల తర్వాత ఇవాళ మార్చాల్సిన అవసరం ఏమున్నదని నిలదీశారు. ఒక్క పథకం అమలు చేయకపోగా, అన్నీ చేశామని గొప్పలు చెప్పుకోవడం ఈ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో కొత్త కోట, భూత్పూర్ మున్సిపాలిటీకు రూ.40 కోట్ల చొప్పున నిధులతో అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. నేటి ఎమ్మెల్యే ఏడాదిలో రూ.40 అయినా తెచ్చి అభివృద్ధి చేశాడా..? అని నిలదీశారు. కేసీఆర్ ఆశీర్వాదంతో నియోజకవర్గానికి 6 గురుకులాలు, 32 చెక్‌డ్యాంలు, గ్రామాలు, తండాలకు బీటీరోడ్లు వేశామన్నారు. ఎన్నికల కంటే ఆరు నెలల ముందు రూ.వంద కోట్లకు సంబంధించిన పనులు మేం పూర్తి చేస్తే, రిబ్బన్లు కట్ చేసుకుంటూ కాంగ్రెస్ నేతలు తిరుగుతున్నారని దుయ్యబట్టారు. ప్రతిపంటకు బోనస్ అంటూ సన్నవడ్లకు మాత్రమే ఇస్తామని రైతులను నిండా ముంచిందన్నారు. హామీలన్నీ నెరవేర్చేదాక వదిలే ప్రసక్తే లేదని, పోరాడుతూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్ మాజీ ఎంపీపీ గుంత మౌనిక, మాజీ సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, కౌన్సిలర్లు ఖాజా, నాగన్న, నాయకులు కొండారెడ్డి, ప్రశాంత్, అయ్యన్న, వసీం ఖాన్ శ్రీనుజీ, గోవిందు, శ్రీనివాసులు, మహేశ్, వికాస్ పాల్గొన్నారు.

# మార్పు పేరిట మాయ

- తెలంగాణ తల్లి ఆకృతిని ఎందుకు మార్చారు?
- సమాజానికి కావాల్సింది బతుకు దెరువు
- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్
- పాల ముసుగులో తెలంగాణ తల్లికి క్షీరాభిషేకం

మహబూబ్‌నగర్ అర్బన్, డిసెంబర్ 10 : మార్పు.. మార్పు అంటూ కాంగ్రెస్‌ను గెలిపిస్తే గద్దెనెక్కిన రేవంత్ గ్యారెంటీలు అమలు చేయకుండా ప్రజలను మాయ చేస్తున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ధ్వజమెత్తారు. మంగళవారం మహబూబ్‌నగర్‌లో తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ తల్లి ఆకృతిని ఎందుకు మార్చారని దుయ్యబట్టారు. బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అన్నారు. సమాజానికి కావాల్సింది బతుకు దెరువు.. అది వదిలేసి మార్పులు.. చేర్పులు చేయడమేమిటని నిలదీశారు. రైతులకు రుణమాఫీ కావాలి.. ఎకరాకూ రూ.15 వేలు ఇవ్వాలి.. వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి.. పాలమూరు ప్రజలకు తాగు, సాగునీరు కావాలి.. యాదవులకు ఇస్తామన్న రూ.2 లక్షలు ఖాతాల్లో జమ చేయాలి.. ముదిరాజ్‌లకు చేప పిల్లలు అందించాలి.. ఆటోలు, లూనాలు ఇవ్వాలి.. ఎస్సీలకు దళితబంధు కింద రూ.10 లక్షలు ఇవ్వాలి.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ఆర్థిక సాయంతోపాటు తులం బంగారం ఇవ్వాలి.. అన్నారు. కులవృత్తులను పూర్తిగా నిర్వీర్యం చేసిన ఘనత రేవంత్‌దే అన్నారు. మీరు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కొత్త వాటితో కాలం వెల్లదీస్తున్నారన్నారు. గతంలో కొత్త రాష్ట్రాలు ఏర్పడినా ఎక్కడ కూడా చరిత్రను మార్చలేదని గుర్తు చేశారు. ప్రకృతిని పూజించే చరిత్ర తెలంగాణలో ఉన్నదని, అలాంటి చరిత్ర తెలంగాణ తల్లిలో ఉన్న బతుకమ్మను ఎందుకు మార్చారో ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. పక్క రాష్ట్రంలో ఎక్కడా పేర్లు మార్చలేదు.. కాని తెలంగాణలో టీఎస్‌ను టీజీగా మార్చారన్నారు. మార్చాల్సింది పేర్లు కాదు.. ప్రజల తలరాతలు మార్చాలని హితవు పలికారు. వివాదాలు సృష్టించడం.. అక్రమ కేసులు బనాయించడం.. బీఆర్ఎస్ నేతలను జైలుకు పంపడం.. ఇదేనా మార్పంటే అని నిలదీశారు. మీరు చేస్తామన్న మార్పుల కోసం ప్రజలు మీకు ఓట్లేయలేదు.. మీరిచ్చిన హామీలను చూసి ఓట్లేశారని గమనించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సంపద దిగజారి పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్, సోనియా, ప్రియాంక వచ్చి ప్రకటించిన హామీలపై దృష్టి సారించాలన్నారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కార్యాచరణ ప్రకటిస్తామని, వచ్చే ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, పట్టణ అధ్యక్షుడు శివరాజ్, ఆంజనేయులు, కౌన్సిలర్ గణేశ్, అనంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్, సాయిలు, రమేశ్‌నాయక్ పాల్గొన్నారు.

## తల్లిని మార్చిన ఘనుడు

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్, డిసెంబర్ 10 : కాంగ్రెస్ వస్తే మార్పు తీసుకొస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి నేడు తెలంగాణ తల్లిని మార్చిన ఘనుడుగా చరిత్ర పుటల్లోకి ఎక్కారని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ అస్తిత్వం జోలికొస్తే తరిమి కొడుతామని ఆయన హెచ్చరించారు. మంగళవారం మక్తల్ పట్టణంలోని హైవేపై తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి ఆయన క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో తెలంగాణ తల్లిని అవమానపర్చుతూ కాంగ్రెస్ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నదని ధ్వజమెత్తారు. స్వరాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పోరాట పటిమతో తెలంగాణ సాధించినట్లు గుర్తు చేశారు. తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదేండ్లు అభివృద్ధి చేసి దేశానికే తలమానికంగా మార్చిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. నాడు కాంగ్రెస్ పాలకుల విగ్రహాలను చెరిపేయాలను కుంటే కేసీఆర్‌కు క్షణం పట్టేది కాదన్నారు. తెలంగాణ తల్లిని చక్కగా రూపొందించి విగ్రహాలను ప్రతిష్టిస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగానే విగ్రహంలో బంగారు హారాలను, తెలంగాణ తల్లి చేతిలో ఉన్న బతుకమ్మను తొలగించడం సరికాదన్నారు. సచివాలయం ఎదుట ఏర్పాటు చేసిన కాంగ్రెస్ తల్లి విగ్రహాన్ని రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక తొలగించి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

కేసీఆర్ ముద్రలను చెరిపేయాలని లక్ష్యంతో రేవంత్ చేస్తున్న జిమ్మిక్కులను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఒక్క హామీ కూడా సక్రమంగా నెరవేర్చలేదన్నారు. రేవంత్ తన కుటుంబాన్ని చక్కదిద్దుకుంటున్నారే తప్పా ప్రజల బాగోగులు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వ అరాచకాలకు ప్రజలు చరమగీతం పాడే సమయం దగ్గర్లోనే ఉన్నదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మక్తల్, మాగనూరు మండలాల అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, ఎల్లారెడ్డి, కౌన్సిలర్లు రాములు, మొగులప్ప, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్‌గౌడ్, నాయకులు హనుమంతు, ఆశిరెడ్డి, గాల్‌రెడ్డి, శంకర్, నారాయణరెడ్డి, నర్సింహారెడ్డి, మారుతిగౌడ్, నరసింహారెడ్డి, అన్వర్, రవికుమార్, సాగర్, ఈశ్వర్ యాదవ్, రాజు, నర్సింహులు, మన్నన్, కృష్ణ, అశోక్‌గౌడ్, ఆనంద్, సాధిక్, అశోక్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.





తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

# రుణమాఫీ కాలె.. పింఛన్లు రాలె..

- కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డితో రైతులు, మహిళలు మొర

పెబ్బేరు, డిసెంబర్ 10 : 'కాంగ్రెస్ ప్రభుత్వం మమ్మల్ని పట్టించుకోవడం లేదు.. అర్హత ఉన్నా ఆసరా పింఛన్లు ఇవ్వడం లేదు.. పెంచుతామన్న పింఛన్లు ఏడాదైనా ఇవ్వడం లేదు.. రేవంత్ సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది' అంటూ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వద్ద రైతులు, మహిళలు మొరపెట్టుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలను ఆయన పరామర్శించి పార్టీ బీమా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బూడిదపాడు, కొత్త సూగూరు గ్రామాలకు చెందిన మహిళలు నిరంజన్‌రెడ్డి వద్దకు వెళ్లి వారి ఆవేదన వెల్లగక్కారు. అర్హత ఉన్నా పింఛన్లు రావడం లేదని, ఏడాదైనా పెరిగిన పింఛన్లు ఇవ్వడం లేదని.. కాంగ్రెస్ పట్టించుకోవడం లేదని వాపోయారు. రుణమాఫీ కేవలం ప్రకటనలకే పరిమితమైందని, అమలులో లేదని, కేవలం రూ.లక్షలోపు వారికే రుణాలను మాఫీ చేశారని ఆరోపించారు. అలాగే సూగూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిరంజన్‌రెడ్డి పరిశీలించారు.. అక్కడే ఉన్న రైతులు కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదన్నారు. వారం రోజులైనా వడ్లు కొనడం లేదని, బోనస్ మాటే ఎత్తడం లేదని, రైతు భరోసా ఇంకెప్పుడని ప్రభుత్వ తీరును ఎండగట్టారు. కేసీఆర్ ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలను వారు గుర్తుకు తెచ్చుకున్నారు. మంత్రిగా మీరున్న కాలంలో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి తాము ఓట్లేసి నట్టేట మునిగిపోయామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, గొర్రెల పెంపకందార్ల మాజీ అధ్యక్షుడు కురుమూర్తి యాదవ్, జిల్లా మీడియా సెల్ కన్వీనర్ అశోక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాములు, మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, మాజీ జెడ్పీటీసీ పద్మ, నాయకులు రమేశ్, వేణురెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటేశ్, ఎల్లారెడ్డి, గోపిబాబు, మధు, వీరస్వామి, గిరి, కిశోర్‌రెడ్డి, గోవిందు ఉన్నారు.

### బీఆర్ఎస్‌కు కార్యకర్తలే బలం

బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలం, బలగమని.. వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని నిరంజన్‌రెడ్డి అన్నారు. మండలంలో ఇటీవల మరణించిన రంగాపురం గ్రామానికి చెందిన బొజ్జన్న, శేఖర్, బూడిదపాడుకు చెందిన రాముడు కుటుంబాలకు బీఆర్ఎస్ తరపున మంజూరైన రూ.2 లక్షల చొప్పున ప్రమాద బీమా చెక్కులను అందజేశారు. కొత్తసూగూరులో మృతి చెందిన కార్యకర్త రాజు కుటుంబాన్ని పరామర్శించి.. పిల్లల చదువులకు చేయూతనందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ దురాగతాలు, ప్రజా వ్యతిరేక చర్యలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలని సూచించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముందు చూపుతోనే ఇటు కార్యకర్తలకు బీమా సౌకర్యం, అటు రైతన్నలకు రైతుబంధు సాయం అందజేశారన్నారు. కుటుంబ యజమాని దూరమైతే ఆ కుటుంబాన్ని ఆదుకొనేందుకే ఈ పథకాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.



రంగాపురంలో చెక్కును అందజేస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

# పత్తిని కొనుగోలు చేయాలి

- మిల్లు వద్ద హైవేపై రైతుల ధర్నా
- రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్లతో బైఠాయింపు
- ఎక్కడికక్కడే నిలిచిన వాహనాలు
- ఎమ్మెల్యే హామీతో ఆందోళన విరమణ

మాగనూరు, డిసెంబర్ 10 : పత్తి రైతులు ఆందోళన బాట పట్టారు. ఆరుగాలం కష్టించి పండించిన తెల్లబంగారాన్ని విక్రయించేందుకు తీసుకొస్తే కొనుగోలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రాయిచూర్-మహబూబ్‌నగర్ హైవేపై పత్తి ట్రాక్టర్లను అడ్డంగా ఉంచి 150 మందికిపై కర్షకులు రోడ్డుపై బైఠాయించారు. మాగనూరు మండలం వడ్వాట్ సమీపంలో ఉన్న బసవేశ్వర జిన్నింగ్ మిల్లులో సీసీఐ (కార్పొరేషన్ కాటన్ ఆఫ్ ఇండస్ట్రీ) వద్దకు నర్వ, అమరచింత, మరికల్, ధన్వాడ, మక్తల్, మాగనూరు, కృష్ణ మండలాలతోపాటు పలు గ్రామాలకు చెందిన రైతులు పత్తిని తీసుకొస్తే నాలుగు, ఐదు రోజులుగా కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లు వద్ద ఉన్న అధికారి పత్తి కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ధ్వజమెత్తారు. రోజుకు 80 నుంచి 100 ట్రాక్టర్ల వరకు కొనుగోలు చేయాల్సి ఉన్నా కేవలం 40, 30, 20 ట్రాక్టర్ల పత్తిని మాత్రమే కొంటున్నారని మండిపడ్డారు. మిల్లులో పత్తిని అన్‌లోడ్ చేసేందుకు కూడా యంత్రాలు సక్రమంగా లేవని.. సెకండ్ హ్యాండ్ మిషనరీలు ఉన్నా.. అవి పనిచేయడం లేదన్నారు. రైతులకు కనీసం తాగడానికి తాగునీరు కూడా ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. సీసీఐ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. 45 నిమిషాల పాటు ధర్నా చేయడంతో రోడ్డుపై వాహనాలు ఎక్కడికక్కడే నిలిచి పోయాయి. విషయం తెలుసుకొన్న సీఐ చంద్రశేఖర్, ఎస్సై అశోక్ బాబు అక్కడకు చేరుకొని రైతులను సముదాయించినా వారు వినలేదు. కొద్ది సేపటి తర్వాత మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి వచ్చారు. మిల్లు వద్ద ఉన్న అధికారి శివాజీతో మాట్లాడి సమస్య తెలుసుకొన్నారు. పత్తి అన్‌లోడ్ చేసే మిషనరీలు చెడిపోయాయని ఎమ్మెల్యేకు వివరించాడు. ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడుతూ పత్తి అన్‌లోడ్ కోసం మిషనరీలు అందుబాటులో ఉంచాలని.. కారణాలు చెప్పొద్దని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రైతులు శాంతించి ఆందోళన విరమించారు. కాగా ఎమ్మెల్యే వస్తున్నాడని మిల్లు అధికారులు అన్‌లోడ్ చేసేందుకు జేసీబీ తెప్పించడంపై రైతులు మండిపడ్డారు.



పత్తిని విక్రయించేందుకు బారులుదీరిన ట్రాక్టర్లు

### నాలుగు రోజులుగా పడిగాపులు



కష్టపడి పండించిన పత్తిని విక్రయించేందుకు మా గ్రామం నుంచి శనివారం ఉదయం మిల్లు వద్దకు వచ్చాను.. మంగళవారం సాయంత్రం వరకు వేచి చూసినా అధికారులు పత్తిని కొనుగోలు చేయడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో కొనుగోలు నత్తనడకన సాగుతుంది. రోజుకు 80 నుంచి 100 ట్రాక్టర్లు కొనేలా చర్యలు తీసుకోవాలి.

*- సురేశ్, కున్సీ, నారాయణపేట జిల్లా*

### తాగేందుకూ నీళ్లులేవు



ఆదివారం ఉదయం పత్తి అమ్మేందుకు వచ్చాను.. మూడ్రోజులుగా పడిగాపులు కాస్తున్నాం.. ఎప్పుడు కొంటారో కండ్లు కాయలు కాసేలా ఉన్నాం.. మంచినీళ్లు కూడా దొరకక రోజుకు నాలుగు బాటిళ్ల నీళ్లు కొనుక్కుంటున్నాం. నీటి సౌకర్యం ఏర్పాటు చేయలేదు.. తినేందుకు తిండి లేక పోయినా పర్లేదు కానీ నీళ్లు కచ్చితంగా ఉండాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

*- లింగమ్మ, రైతు, ఎక్లాస్‌పూర్, నారాయణపేట జిల్లా*



పత్తిని కొనుగోలు చేయాలని వడ్వాట్ గేటు వద్ద జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

## వివాహిత ఆత్మహత్య

గద్వాల అర్బన్, డిసెంబర్ 10 : ఇంట్లో ఎవరులేని సమయంలో ఓ యువతి ఉరేసుకొని అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన చోటు చేసుకున్నది. తల్లిదండ్రుల కథనం మేరకు.. మల్దకల్ మండలం మద్దెలబండకు చెందిన బోయ పవిత్ర(22), అదే గ్రామానికి చెందిన కమ్మరి వినయ్ రెండేండ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. అనంతరం వీరు జిల్లా కేంద్రంలోని భీంనగర్‌కాలనీలో నివాసం ఉంటున్నారు. కొన్ని రోజులు కాపురం సజావుగా సాగగా.. తర్వాత విబేధాలు తలెత్తడంతో చిన్నపాటి ఘర్షణ చోటుచేసుకున్నది. గతంలో కూడా భర్త వేధించడం తోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. మళ్లీ వేధింపుల కారణంగానే మంగళవారం ఉదయం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గద్వాల టౌన్ ఎస్సై కల్యాణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. ఘటన తమ దృష్టికి రాగా.. ఆరా తీస్తున్నామన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయిత్రి
- మద్యం లారీ యజమానులతో సమావేశం

తిమ్మాజిపేట, డిసెంబర్ 10 : మద్యం లారీ యజమానుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నాగర్‌కర్నూల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయిత్రి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని టీజీఎస్ బీసీఎల్ స్టాక్ పాయింట్‌కు మద్యం సరఫరా చేసే లారీ యజమానులు, డ్రైవర్లతో ఎస్సై నరేందర్‌రెడ్డి, స్టాక్ పాయింట్ అధికారులతో కలిసి ఆమె సమావేశమయ్యారు. స్టాక్ పాయింట్ బయట నిలిపి ఉన్న లారీల నుంచి ఇటీవల కాలంలో మద్యం చోరీ అవుతుండడంతో యజమానులు, డ్రైవర్లు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే.. ఈ నేపథ్యంలో వారితో అధికారులు సమావేశమై.. డిమాండ్ల పరిష్కారం కోసం చర్చలు జరిపారు. మద్యం లారీలకు రక్షణ కల్పించాలని, స్టాక్ పాయింట్ లోపల పార్కింగ్ అనుమతించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, రోజుల తరబడి లారీలను నిలపకుండా స్టాక్ పాయింట్‌లో మద్యం అవసరం మేరకు పంపించాలని వారు కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఈఎస్, స్టాక్ పాయింట్ జీఎంకు ఫోన్‌లో సమాచారం అందించారు. వీటిని పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పినట్లు ఈఎస్ తెలిపారు. సమావేశంలో ఎక్సైజ్ సీఐ కల్యాణ్, ఎస్సై నవీన్‌కుమార్‌రెడ్డి, స్టాక్ పాయింట్ ఎస్సై బాలీశ్వరి పాల్గొన్నారు.